
క్లుప్తంగా

సీపీఎంలో చేరిక



అచ్చంపేట రూరల్: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మల్లేష్ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి పర్వతాలు సమక్షంలో సీపీఎంలో చేరారు. కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సీపీఎం తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. సీపీఎం పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మల్లేష్ తెలిపారు.

అదుపుతప్పితే అంతే..



వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండా–చెర్కూర్ గ్రామాల మధ్య నిర్మించిన బ్రిడ్జికి రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎదురుగా భారీ వాహనం వస్తే బిక్కుబిక్కు మంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ద్విచక్ర వాహనదారులు వాపోయారు. గతంలో బ్రిడ్జికి మరమ్మతు పనులు చేసేందుకు అధికారులు సర్వే చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అమ్మాయిలను వేధిస్తే చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రేమపేరుతో అమ్మాయిలను వేధిస్తే చర్యలు తీసుకుంటామని షీటీం అధికారి వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సార్వత్రిక అధ్యయన కేంద్రంలో షీటీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అమ్మాయిలపై దాడులు దాడులు పెరిగాయన్నారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైన విద్యార్థినులను వేధిస్తే షీ టీం నంబర్: 8712657676 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని తెలిపారు.

మద్యం పట్టివేత

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో బెల్టుషాపులో రూ.10వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం విక్రయిస్తున్నారని అందుకున్న సమాచారం మేరకు గ్రామంలో తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు రాఘవేందర్, మోహన్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, పుణ్యావచనం, నవగ్రహ పూజ, మండప అర్చన, ప్రధాన కలశ స్థాపన, ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ సుదర్శన మహా రుద్రయాగం, కుంభాభిషేకం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామమని పేర్కొన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గుంతను పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాడూరు: రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంత శీర్షికతో గురువారం సాక్షిలో వార్త ప్రచురితం అయ్యింది. దీనికి అధికారులు స్పందించి ఆదివారం మొర్రం మట్టితో గుంతను పూడ్చివేయించారు. యాదిరెడ్డి, ఇంద్రకల్ గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో పూజలు



వెల్దండ మండలం గుండాలలో పూజలు చేస్తున్న భక్తులు



లింగాలలో భజన కీర్తనలను ఆలపిస్తున్న భక్తులు



మన్ననూర్‌లో ..

నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలోని శివాలయంలో ఆదివారం సామూహిక భగవద్గీత పారాయణ పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి బాలస్వామి మాట్లాడుతూ కురుక్షేత్ర యుద్ధంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి ఉపదేశించిన సారాంశమే భగవద్గీత అని అన్నారు. భగవద్గీతలో 18 అధ్యాయాలలో 700 శ్లోకాలు ఉన్నాయన్నారు. ప్రతి ఆదివారం జిల్లా కేంద్రంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తామన్నారు. గుజ్జరి నిరంజన్, కొండూరు నరసింహ, రఘునందన్ గౌడ్, చంద్రమౌళి, రామ్మోహన్, బాలస్వామి, బాలరాజ్,మన్యపు రెడ్డి, వెంకట్ శెట్టి, శ్రీనివాసులు, సలేశ్వరం, కృష్ణంరాజు, భగవద్గీత పారాయణ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

వెల్దండ: మండలంలోని గుండాలలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తులు శివలింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కొనేరులో భక్తులు పుణ్యస్నానాలను ఆచరించి శివపార్వతలకు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. బొల్లంపల్లి గ్రామానికి చెందిన చిన్న జంగయ్యయాదవ్, మహేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

లింగాల: మండల కేంద్రం సమీపంలోని దారారం వెళ్లే మార్గంలో ఉన్న తిరుమల గుట్టపై వెలసిన తిరుమలేశుడి వార్షిక పూజలు ఆదివారం ముగిశాయి. 15న బల్మూర్‌ను నుంచి తిరుమలేశుడి విగ్రహాలను తిరుమల గుట్టపై ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో అఖండ భజనలు, ఉపవాస దీక్షలు, దీపారాధనలు నిర్వహించారు. లింగాల, బల్మూర్, అనంతవరం, గట్టుతుమ్మెన్ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శమంతకమణి, బాలకృష్ణ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రఘునందన్, శ్రీశైలం, వెంకటనారాయణ, భాస్కర్, శ్రీనివాసులు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయలగండిలో..

మన్ననూర్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు వారం రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామి వారిని ప్రముఖులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జలంధర్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మంతటి నారాయణలు సకుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మైసమ్మ దేవతకు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గద్వాల, పెబ్బేరు, కొల్లాపూర్, అయ్యంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాలలో తరలివచ్చారు. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన భక్తులు మైసమ్మ దేవత వద్ద ప్రత్యేక పూజలు చేసి గొర్రెపొట్టేళ్లను బలిచ్చారు. మొత్తం 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

అమ్రాబాద్: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. రాయలగండి లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. పదర మండలానికి చెందిన వంకేశ్వరం, చిట్లంకుంట, అమ్రాబాద్ మండలానికి చెందిన జంగంరెడ్డిపల్లి గ్రామ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. ఫైనల్‌లో చిట్లంకుంట జట్టుపై వంకేశ్వరం జట్టు గెలుపొందింది. బహుమతులను ఎమ్మెల్యే వంశీకృష్ణ పంపిణీ చేశారు. విజేతకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి చిట్లంకుంటకు రూ. 70 వేలు, మూడో బహుమతి జంగంరెడ్డిపల్లి రూ.30 వేలు అందజేశారు. జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తాడూరు: మండల కేంద్రంలో నేటి నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీహెచ్‌ఎం పర్వత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, శిర్సవాడ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం విద్యార్థులు 393 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రమైన అమ్రాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 91, మన్ననూర్ బాలికల రెసిడెన్షియల్‌లో 274, దోమలపెంటలో 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాధికారి బాలకిషన్ తెలిపారు. పదర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 94 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

చారకొండ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శంకర్ నాయక్ తెలిపారు. మొత్తం 202 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లికార్జున్ తెలిపారు. మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు.

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: కోడేరు ఎంపీపీ రాధ, ఆమె భర్త సుధాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎంపీఓల సంఘం రాష్ట్ర నాయకుడు నారాయణ, టీపీఎస్ఎఫ్ జిల్లా నాయకుడు రాజేశ్వర్, దామోదర్, మహేష్, ప్రదీప్‌లు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారి, కోడేరు ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌పై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించడం సరికాదని పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దాడిని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు చేపడుతామని, చర్యలు తీసుకోకపోతే విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఉప్పునుంతల: ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌పై దాడిచేసిన ఎంపీపీని వెంటనే అరెస్టు చేయాలని ఎంపీఓ సంఘం రాష్ట్ర నాయకుడు ఎం నారాయణ, జిల్లా నాయకులు వెంకటయ్య, చంద్రశేఖర్, వెంకటేష్, నర్సింహ్మలు, వెంకటేష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాం డ్‌చేశారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

కోడేరు: ఎంపీఓపై దాడిని నిరసిస్తూ సోమవారం తెలంగాణ గజిటెడ్ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలువుతామని ఆ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి భగవాణి నరసింహులు, టీజీఓ జిల్లా కోశాధికారి ఎస్టీఓలు రాజుగౌడు, డిప్యూటీ తహసీల్దార్ ఖాజా, సంజీవ భరత్‌కుమార్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నాగర్‌కర్నూల్: ఎంపీఓపై ఎంపీపీ దాడిని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ కృష్ణ, డాక్టర్ యం శ్రీధర్ శర్మ ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు.

బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేనా?

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని వనపట్ల నుంచి గడ్డంపల్లి వరకు గల బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం 3.56 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు కాంట్రాక్టర్ రోడ్డు పనులు కోసం ఆయా గ్రామాలకు కంకర వేశారు. ఆరు నెలల నుంచి పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కంకరపై ఆయా గ్రామస్తులు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. తెలకపల్లి మండలం నుంచి కొన్ని గ్రామాల ప్రజలు నాగర్‌కర్నూల్ వెళ్లేందుకు ఈ మార్గం తక్కువ దూరం కావడంతో ఇక్కడ నుంచే రాకపోకలు కొనసాగిస్తారు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత పంచాయితీరాజ్ శాఖ అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గడ్డంపల్లి నుంచి వనపట్లకు వెళ్లే రోడ్డు

జగదీశ్వర్‌రావు నియామకంపై హర్షం

పెద్దకొత్తపల్లి: తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా చింతలపల్లి జగదీశ్వర్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, ఎంపీటీసీలు ఖాజా, రవికుమార్, మాజీ సర్పంచ్‌లు నాగమ్మ, రాధ హర్షం వ్యక్తం చేశారు.

కల్వకుర్తిరూరల్: ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కల్వ సుజాతను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిశెట్టి శంకర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి రమేష్, కోశాధికారి జగదీశ్వర్, శ్రీధర్‌లతోపాటు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. అదేవిధంగా సోమవారం నుంచి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. పరీక్షలు బాగా రాసి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని హెచ్‌ఎం పర్వత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: గుడిపల్లి రిజర్వాయర్ కట్టపై కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయిన గ్రామస్తులు వాపోయారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా కంపచెట్లు తొలగింపు, గుంతలలో మొర్రం వేసి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

చెట్లను నరికితే చర్యలు

కొల్లాపూర్ రూరల్: నియోజకవర్గ రేంజ్ పరిధిలో ఉన్న అటవీలో చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నార్లాపూర్, ముక్కిడిగుండం సమీపంలో ఉన్న ఫారెస్టులో కొందరు చెట్లను నరికట్లు బేస్ క్యాంపు సిబ్బంది గుర్తించినట్లు పేర్కొన్నారు. నార్లాపూర్ సమీపంలో ఉన్న లచ్చనాయక్ తండాకు చెందిన చిన్న గోపాల్, ముక్కిడిగుండం గ్రామానికి చెందిన లింగస్వామిలు చెట్లు నరికనట్లు గుర్తించామన్నారు. ఇద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్



నాగర్‌కర్నూల్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల జిల్లా కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని హిమాలయ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వల్లభనేని శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రెటరీగా రాజు, ట్రెజరర్‌గా వెంకటేష్‌నును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర తస్మా అధ్యక్షులు సాదుల మధుసూదన్, ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా మహబూబ్ నగర్ తస్మా అధ్యక్షుడు బి.లక్ష్మణ్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

లింగాల: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య కొన్నేళ్ల నుంచి భూతగాదాలు ఉన్నాయి. శనివారం ఇరువురు కుటుంబాలు ఒకరిపై దాడులు చేసుకొన్నారు. గ్రామానికి చెందిన పల్లపు లక్ష్మయ్య కుటుంబ సభ్యులు డేరంగుల దేవేంద్రుడి వర్గంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. ఆదివారం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన రమేష్‌బాబు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధితుడికి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలి



నాగర్‌కర్నూల్: భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు. రాష్ట్ర ప్రధాన కార్య దర్శి నర్సిములు, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బీఈ విజయ్ కుమార్, పండిత పరిషత్ బృందం ఉన్నారు.

బావికి రక్షణ గోడ నిర్మించండి



బిజినేపల్లి: మండల కేంద్రం నుంచి గోవర్ధనగిరికి డబుల్ బీటి రోడ్డును నిర్మించిన అధికారులు, గోవర్ధనగిరి సమీపంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావికి రక్షణ గోడను నిర్మించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన చేస్తున్నారు. రోడ్డుకు అతి సమీపంలో ఉన్న బావిలో అదుపు తప్పి ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలు పడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించాలని గ్రాస్తుడు కోరుతున్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన



బిజినేపల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అసంపూర్తిగా స్త్రీశక్తి భవనం

తాడూరు: మండల కేంద్రంలో దశాబ్ద కాలం కిందట రూ.18 లక్షలతో స్త్రీశక్తి భవన నిర్మాణం పనులను చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దాదాపు నాలుగేండ్లుగా అసంపూర్తిగా వదిలేయడం ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిధుల మంజూరైన అసంపూర్తిగా భవనం వదిలేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెత్తుకే పరిమితమైన స్త్రీశక్తి భవనం

ఈతకెళ్తున్నారా.. జర జాగ్రత్త!



పాన్‌గల్: వేసవి వచ్చిందంటే చాలు యువత, చిన్నారులు చెరువులు, కాల్వల్లో స్నానాలకు వెళ్తుంటారు. సరదాగా వేసవి తాపం తీరుకోవడానికి వెళ్లి వారి కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. ఇలా సరదా విషాదం నింపిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ వేసవిలో అయినా కనీస జాగ్రత్తలు పాటించి సరదా సమయాన్ని విషాదం కాకుండా చుసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు.

-15 ఏళ్ల లోపు పిల్లలు చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి.
-తల్లిదండ్రులు తీసుకెళ్తే మోకాలు, నడుము లోతు వరకే దిగేలా చూడాలి.
-శిక్షకుడి పర్యవేక్షణలో ఈత నేర్పించాలి.
-యువత మద్యం, మత్తు పదార్థాలు తీసుకొని నీటిలోకి దిగవద్దు.
-పాఠశాలలకు ఒంటి పూట బడి ఉండటంతో బడి వదిలిన వెంటనే విద్యార్థులు ఈతలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో పాటు పోలీసులు కూడా గ్రామాల్లో ఈతకు వెళ్లే వారికి అవగాహన కల్పిస్తే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయని పలువురు వాపోతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

చారకొండ: మండలంంంంలోని లగ్రహారం తండాకు చెందిన మాజీ సర్పంచ్ సేనావత్ ప్రశాంత్ నాయక్, మాజీ వార్డు సభ్యులు, మరో 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పర్వతాలు, పరశురాం, శంకర్, దేవు, రామకృష్ణ, తుల్చానాయక్ తదితరులు ఉన్నారు.